www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 మే 2024



ఎపిఇఎపి సెట్ కేంద్రాల్లో వైవీయూ విసి తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఇఎపి సెట్)-2024 జరుగుతున్న పరీక్షా కేంద్రాలను యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన కడపలోని శ్రీనివాస ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ అండ్ సైన్స్, కెఎస్ఆర్ఎమ్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. కంప్యూటర్ బేస్ట్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలు, పరీక్షలకు సంబంధించి సాంకేతిక పరమైన అంశాల గురించి నిర్వాహకులతో మాట్లాడారు. పరీక్ష జరుగుతున్న తీరును ఆయన గమనించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ విసి సుధాకర్

ఖరీఫ్ సాగుకు కసరత్తు!



- 1.85 లక్షల ఎకరాల్లో ప్రణాళిక
- 12,243 క్వింటాళ్ల విత్తనం
- 73,583 టన్నుల ఎరువులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ఖరీఫ్-2024 యాక్షన్‌ప్లాన్ సిద్ధమైంది. జిల్లా వ్యవసాయశాఖ 1.85,716 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు కసరత్తు చేస్తోంది. గతేడాది 1.92 లక్షల ఎకరాల్లో పంటల సాగు ప్రణాళిక రూపకల్పన చేసిన సంగతి తెలిసిందే. 2024-25 ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని కుదించడం గమనార్హం. ఎరువులు, విత్తన, పురుగు మందుల ప్రతిపాదనల్ని అందజేసింది. ప్రభుత్వ ఆమోదం అనంతరం పంపిణీ చేయడానికి అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. పచ్చిరొట్ట ఎరువులు, వేరుశనగ, ఇతర పంటల సబ్సిడీ విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 210 ఆర్‌బికెల ద్వారా విత్తనం, ఎరువుల పంపిణీ ఏర్పాట్లపై దృష్టి సారించింది. 12.243 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచడానికి అవసరమైన కసరత్తు చేస్తోంది. 5,323 క్వింటాళ్ల పిల్లిపెసర, జనుము, జీలగ వంటి పచ్చి రొట్ట ఎరువులను, 5,323 క్వింటాళ్ల కె6, నారాయణి, కె1812, టిసి జిఎస్ రకాల వేరుశనగ విత్తనాల్ని అందుబాటులో ఉంచనుంది. 76,992 ఎకరాల్లో వరి, 87,037 ఎకరాలలో వరితో కలిపి ఇతర ముతక ధాన్యాలు, 16,894 ఎకరాల్లో కందులు, మినుములు, పెసలు, నువ్వులు వంటి పప్పుధాన్యాలు ఆయిల్‌సీడ్స్ 22,059 ఎకరాలు, పత్తి 59,492 ఎకరాలు, 232 ఎకరాల్లో సుగర్‌కేన్ సాగు చేయనుంది. 73,583 మెట్రిక్ టన్నుల ఎరువుల ప్రతిపాదనలు అందజేసింది. 22,208 టన్నుల యూరియా, 9,226 టన్నుల డిఎపి, 2,791 టన్నుల ఎంఒపి, 3,997 టన్నుల ఎస్ఎస్‌పి, 36,362 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంది. జిల్లాలో 38,739 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉండడం గమనార్హం. వీటిని సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇండెంట్ పెట్టనుంది. అనంతరం జిల్లాలోని ఆర్‌బికెల ద్వారా రైతులకు సరాఫరా చేయనుంది.

ఆయుర్వేద వైద్య విధానాలు నేటికీ అనుసరణీయమే

- ఎల్ఐసి ఎస్‌డిఎం రవికుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆధునిక వైద్యం బాగా విస్తరించిన నేటి కాలంలో కూడా, ప్రాచీన వైద్య విధానాలైన ఆయుర్వేద, సిద్ధ వైద్య విధానాలు నేటికీ అనుసరణీయమని కడప ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జికెఆర్‌వి రవికుమార్ అన్నారు. శుక్రవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్ఐసి-శాంతిగిరి ఆయుర్వేద సిద్ధ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం వ్యాధిని నయం చేయడంపై దృష్టి పెడితే, సిద్ధ ఆరోగ్యాన్ని సమకూరుస్తుందని పేర్కొన్నారు. శారీరక వ్యవస్థ మొత్తాన్ని పునరుజ్జీవం చేస్తుందని తెలిపారు. మొండి వ్యాధుల్ని, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలని పరిష్కరించడంలో ఈ వైద్య విధానాల ప్రాధాన్యత అందరూ గుర్తిస్తున్నారని చెప్పారు. ఏ వైద్య విధానం ఎంచుకుంటామన్నది వ్యాధి స్వభావం పై ఆధారపడి ఉంటుందన్నారు. శాంతిగిరి ఆయుర్వేద-సిద్ధ హాస్పిటల్ బాధ్యులు, వైద్య శిబిరంలో పాల్గొన్న ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఆదర్శ్ అజయ్, డాక్టర్ టి.ఎస్.వందన మాట్లాడుతూ వెన్నునొప్పి, మోకాళ్ళ నొప్పి, కీళ్లనొప్పి, చర్మసంబంధ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు, నాడీ సంబంధిత సమస్యలు వీటికి శిబిరంలో కన్సల్టేషన్, వైద్య సేవలు అందించామని పేర్కొన్నారు. దేవుని కడపలో వున్న తమ కేరళ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్, వార్డ్ రూమ్‌ల సౌకర్యాలతో సాంప్రదాయక పంచకర్మ వైద్యాన్ని కూడా అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. 50 మంది పైగా ఉపయోగించుకున్న ఈ ఉచిత శిబిరం లో శాంతి గిరి ఆసుపత్రి మేనేజర్ మోహనన్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, సీనియర్ థెరపిస్టులు మను, మిథున్ సేవలు అందించారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఎఎస్ మేనేజర్ సత్య ప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ఆనందరావు, రఘునాథ్ రెడ్డి, అవధానం శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న ఎస్‌డిఎం రవి కుమార్

ట్రిపుల్‌ఐటి ఎఒగా రవికుమార్ నియామకం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ నూతన పరిపాలన అధికారిగా డాక్టర్ పెనుకొండ రవికుమార్‌ను నియమించినట్లు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శుక్రవారం ఎఒగా రవికుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెనుగొండ రవికుమార్ అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన జపాన్‌లోని యూనివర్సిటీ అఫ్ అయిజులోమ పిహెచ్‌డి పూర్తి చేసి ట్రిపుల్‌ఐటి ఇడుపులపాయలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 10 సంవత్సరాల నుండి యూనివర్సిటీలోని కీలకమైన ఎంటెక్ కో-ఆర్డినేటర్‌గా, ఐటి ఇన్‌ఛార్జిగా, డిపార్ట్‌మెంట్ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా, ఐటి ఇన్‌ఫ్రాక్చర్ కో-ఆర్డినేటర్‌గా, ఎస్టబ్లిష్‌మెంట్ సెక్షన్ కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలను నిర్వహించడంలో క్రియాశీలకంగా వ్యవహరించి యూనివర్సిటీకి సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎఒ డాక్టర్ పెనుగొండ రవికుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ పరిపాలనఅధికారి బాధ్యతను కూడా క్రియాశీలకంగా నిర్వహించి యూనివర్సిటీ అభివృద్ధికి దోహదం చేసే విధంగా తన బాధ్యతను నిర్వహిస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన, ఛాన్సలర్ కెసిరెడ్డి, ఎఒ రాంభూపాల్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కుమార స్వామి గుప్తా, సెంట్రల్ ఎఒ భానుకిరణ్, రిజిస్ట్రార్ గోపాల్ రాజు, వైస్ ఛాన్సలర్ విజయ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



రవికుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్ కుమార స్వామి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపల్ రామనాథన్

'మిట్స్'లో ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్‌లో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని గొప్ప నాటకకర్త విలియం షేక్స్‌పియర్ పుట్టినరోజు జ్ఞాపకార్థంగా జరుపుకుంటున్నామన్నారు. ఆంగ్ల భాష అత్యంత ప్రసిద్ధ నాటక రచయితగా షేక్స్‌పియర్ ఆధునిక ఆంగ్లంపై కూడా భారీ ప్రభావాన్ని చూపారని పేర్కొన్నారు. అతను రాసే సమయంలో 16, 17వ శతాబ్దాలలో ఆంగ్ల భాష చాలా మార్పులకు గురైందన్నారు. విద్యార్థులు స్టాన్లీ హౌటన్ రచించిన "ది డియర్ డిపార్టెడ్ ఎ కామెడీ ఇన్ వన్ యాక్ట్' నవలను నాటికగా చేసి శ్రోతలను అలరింపజేశారు. కార్యక్రమంలో డీన్ బసబి చక్రబర్తి, విభాగాధిపతి డాక్టర్ అత్తర్ సమీనా ఖాన్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

రేపు అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

ప్రజాశక్తి-రాయచోటి : ఎయిడ్స్ వ్యాధితో తమ జీవితాలను కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఈ నెల 19న అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించబడుతుందని జిల్లా కుష్టు ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే గా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో ఎంతోమంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని, వారి జ్ఞాపకార్థం కోసం, హెచ్ఐవి తో జీవిస్తున్న ప్రజలకు సహాయం చేయడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి వల్ల వచ్చే కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. 19న రాయచోటిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డైట్ కళాశాల వరకు 'ప్రేమ, సంఘీభావంతో మనందరం గుర్తుంచుకుందాం, మనందరం నయం చేసుకుందాం' అనే థీమ్‌తో ఈ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

బిపి కంట్రోల్‌లో ఉంటే.. ఆరోగ్యం సురక్షితం

- ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మంచి ఆహారపు అలవాట్లను పాటించి, బిపిని కంట్రోల్‌లో ఉంచుకుంటే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంలో రక్తప్రసరణ సజావుగా లేకపోతే హెచ్చుతగ్గుల వలన బిపి వస్తుందని పేర్కొన్నారు. షుగర్ కంటే డేంజరస్ బిపి అన్నారు. సమాజంలో ధూమపానం, ఉబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, అధిక కొలెస్ట్రాల్ తదితర వాటి వలన బిపి వస్తుందని పేర్కొన్నారు. తలనొప్పి, చాతినొప్పి, నీరసం, కళ్లు మసకబారటం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నిద్రలేమి వంటివి లక్షణాలుగా పరిగణించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు శివాని, శ్రీలక్ష్మి, హిమబిందు, కిషోర్, శ్రీవిద్య, వైద్య సిబ్బంది గోవిందమ్మ, నాగిరెడ్డి, మురళి, గంగాధర, నూరాని, సరస్వతి, నాగమణి, సునీత, బాబా ఫకృద్దీన్, సుధాకర్, జావీద్, విజ్ఞాన్, సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

నిర్వహణ కొరవడి.. సమస్యల ఒరవడి..!



ఆర్‌టిసి క్వార్టర్ల వద్ద మడుగును తలపిస్తున్న గుంటలు

- మడుగును తలపిస్తున్న బస్టాండ్ ఆవరణం
- నిరుపయోగంగా నీటి శుద్ధి కేంద్రం
- పార్కింగ్ లేక అడ్డదిడ్డంగా వాహనాలు
- పట్టని ఆర్‌టిసి అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లాలో కీలకమైన రాజంపేట ఆర్‌టిసి బసాండ్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా పార్లమెంట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రం రాజంపేట. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ఆర్‌టిసి బస్టాండ్‌లోని సమస్యల గురించి అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. కార్మికులు, ప్రయాణికులు, ఆర్‌టిసి సిబ్బంది కోసం లక్షలు వెచ్చించి నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినా కొన్ని నెలలుగా వాటర్ ప్లాంట్‌లో శీతలీకరణ యంత్రం చెడిపోయింది. వేసవిలో చల్లని నీరు అందుబాటులో లేక వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉంటూ కనీసం ప్రయాణికులు, ఆర్‌టిసి సిబ్బందికి మంచినీటిని కూడా అందించలేని దుస్థితిలో రాజంపేట ఆర్‌టిసి బస్టాండ్ ఉంటోంది. శాశ్వత పరిష్కారంగా శీతల నీటి శుద్ధి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురాలేక దాతల సహకారంతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. అందులో కూడా ఒక రోజు నీరుంటే వారం రోజులు నీరు లేక ప్రయాణికులతో పాటు ఆర్‌టిసి సిబ్బంది మంచినీటి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేక ద్విచక్ర వాహనదారులు బస్టాండ్ ఆవరణలోనే అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో కావలసినంత స్థలం ఉన్నా పార్కింగ్ ఏర్పాటు చేసి ఆర్‌టిసి సంస్థకు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. మరీ ముఖ్యంగా ఆర్‌టిసి సిబ్బందికి ఏర్పాటు చేసిన వసతి గృహాలు మందుబాబులకు, అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారి చెత్తాచెదారం, కంప చెట్లుతో మురుగునీరు చేరి ఆర్‌టిసి క్వార్టర్లు వద్ద మడుగును తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో మందుబాబులకు, ఆకతాయిలకు అడ్డాగా మారి అసాంఘిక కార్యక్రమాలు నిత్యకృత్యమయ్యాయి. ఇప్పటికైనా ఆర్‌టిసి ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రాజంపేట బస్టాండ్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి సిబ్బందికి, ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యలపై ఆర్‌టిసి డిపో మేనేజర్ రమణయ్యను వివరణ కోసం చరవాణి ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.



బస్టాండ్ వద్ద పార్కింగ్ లేక అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలు

లెక్కలు వేస్తూ..అంచనాకు వస్తూ..!

గెలుపోటములపై అభ్యర్థుల ఆరా - పీలేరులో 77.85 శాతం పోలింగ్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు, ఓటమిపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ తరపున నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి బాలిరెడ్డిగారి సోమశేఖర్‌రెడ్డి, మరో రెండు ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో దిగారు. అయినా ప్రధాన పోటీ వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్యే ఉండడంతో ఆ ఇరు పార్టీల నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం తమదంటే తమదంటూ ఎవరి అంచనాల్లో వారున్నారు. ఏకంగా తమ అభ్యర్థికి 10 వేల ఓట్ల మెజార్టీ తగ్గదంటూ ఒకరంటే, 20 వేల ఓట్ల మెజార్టీ తగ్గదంటూ మరొకరు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు సైతం తమ తమ పార్టీల నాయకులు, బూత్ కమిటీల సభ్యులతో పోలింగ్ సరళి, పోలైన ఓట్లు, గెలుపోటములు, సాధించనున్న ఆధిక్యతలపై సమీక్షలు జరిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల కన్నా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన 2.09 శాతం పోలింగ్ ఏ పార్టీకి ప్రయోజనం కలిగించిందో అంచనా వేయలేక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. 77.85 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ పరిస్థితిపై ఎవరూ ఎలాంటి స్పష్టమైన అంచనాలకు రాలేకపోతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఓ వైపు ఓటమి భయం ఉన్నా, మరో వైపు గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పైకి మాత్రం గెలుపు తమదంటే తమదన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలన్న ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో సమైక్యాంధ్ర పార్టీ తరపున, 2019లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి అపజయం పొందిన నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మూడోసారి 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగానే పోటీ చేసి తన గెలుపు ఖాయం అన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. అధికార వైసిపి శ్రేణుల్లో నెలకొన్న అనిశ్చితి, నిరాశ, నిస్పృహలు, నేతలు, కార్యకర్తల మధ్య పెరిగిన దూరం వంటి పరిస్థితులతో పాటు, పీలేరులో ప్రభుత్వ భూముల కబ్జా, ఇసుక, మైనింగ్, అక్రమ ఇంటి స్థలాల వ్యాపారం వంటి వ్యతిరేక పరిస్థితులు, ప్రభుత్వ వైఫల్యాలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులపై పెట్టిన తప్పుడు కేసులు తెలుగుదేశం పార్టీపై సానుభూతి పెంచడం, తనను రెండుసార్లు ఓటమి పాలు చేసిన జనం సానుభూతితో మూడోసారి గెలిపిస్తారన్న ఆశాభావంతో టిడిపి అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. పీలేరుకు 100 పడకలు, కలికిరి, వాల్మీకిపురంకు 50 పడకల ఆసుపత్రుల భవనాలు, మదనపల్లి-తిరుపతి మధ్య పీలేరు మీదుగా నాలుగు లైన్ల రోడ్డు, పీలేరు పట్టణంలో ఆర్‌ఒబిల నిర్మాణం పనులు, స్వచ్ఛతాగునీటి ప్లాంట్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులతో పాటు సిఎం సహాయనిధి నుంచి పలువురికి అందిన ఆర్థిక సాయం, పేదలకు ఇంటి స్థలాలు, జగనన్న ఇండ్ల మంజూరు వంటివి తనకు భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయన్న భరోసాతో చింతల రామచంద్రారెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఓట్లు వేయడానికి ఎండను సైతం లెక్కచేయకుండా క్యూలలో బారులు తీరిన ఓటర్లు, పెరిగిన పోలింగ్ శాతంపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు ఎవరికి వారు అమకు అనుకూలంగా లెక్కలు కట్టుకుని గెలుపు అంచనాలతో మెజారిటీ పై బేరెజు వేసుకుంటున్నారు. స్థానికంగా ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల్లో మాత్రం ఉత్కంఠత నెలకొంది. మరి విజయం ఎవరిని వరిస్తుందో జూన్ 4 వరకు ఎదురు చూడక తప్పింది కాదు.



ఆరోగ్య సేవల్లో ఆశాల పాత్ర కీలకం

- డిఎంఒ డాక్టర్ రియాజ్ బేగ్

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశాల పాత్ర చాలా కీలకమైనదని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్ పేర్కొన్నారు. శుక్రవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో నెలవారీ ఆశా నోడల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు ఆశాలు మూల స్తంభాలు లాంటి వారని అన్నారు. ఆశాలకు నెలవారీ జరిగే ఆశాడే లలో వారికి ప్రస్తుతం జరుగుతున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలని తెలిపారు. ప్రస్తుతం వయోజన టిబి టీకా కార్యక్రమంలో ఆశాలు లబ్ధిదారులను గుర్తించి టీకాకు ప్రోత్సాహించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు తీసుకొచ్చి వేయిస్తున్నారని చెప్పారు. నూతనంగా నియమించబడిన ఆశాకార్యకర్తలకు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఆశా నోడల్ అధికారులు రోజువారీ ఆశాల పనితీరు పర్యవేక్షిస్తూ వారికి ఇచ్చిన ట్యాబ్‌లలో రోజు లాగిన్ అయి వారు అందించు సేవలు అప్‌డేట్ చేయులాగున వారికి తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆశానోడల్ అధికారులకు జిల్లా కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుగుణ, సిహెచ్‌ఒ నారాయణ, వెంకటేష్ డిపిఒ మునీశ్వర్, డిఎస్ఒ కరీముల్లా, జిల్లాలోని వివిధ పిహెచ్‌సిలలో పనిచేసే ఆశా నోడల్ అధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న డాక్టర్ రియాజ్‌బేగ్



ఎంపికల్లో పాల్గొన్న మహిళా క్రీడాకారులు

జిల్లా మహిళా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన సీనియర్స్, అండర్-23, అండర్-19, అండర్-15 జిల్లా మహిళా క్రికెట్ జట్ల ఎంపికలకు జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో విశేష స్పందన లభించింది. ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. మహిళా క్రికెట్‌ను అసోసియేషన్ చాలా ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లా జట్టుకే ఎంపికైన వారు ఎసిఎ నిర్వహించే మ్యాచ్‌లలో మంచి ప్రతిభ కనబరచి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ముని కుమార్‌రెడ్డి, విష్ణుమోహన్‌రావు, శివప్రసాద్, ఎసిఎ సౌజన్ హెడ్ కోచ్ మధుసూదన్‌రెడ్డి, కోచ్‌లు ఇలియాస్, అబూబకర్ పాల్గొన్నారు.

23న రాయచోటి మండల సమావేశం

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 23న గురువారం ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు పల్లపు రాజమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో కచ్చితంగా హాజరు కావాలని పేర్కొనాఆనరు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.



బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

వర్షం వస్తే ఆర్‌టిసి బస్టాండ్ చిత్తడే చిత్తడి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్ చిన్నపాటి వర్షానికే చిత్తచిత్తడిగా మారడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నిలబడితే ప్రయాణికులు బురదనీటిలో దిగాల్సి వస్తోందని అంటున్నారు. ప్రతి ఏడాది గాలివీడు బస్టాండ్ నుంచి ఆర్‌టిసికి రెండు లక్షల పైబడి ఆదాయం వస్తున్నావసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణంలో సిమెంటుతో ప్లాస్టరింగ్ చేస్తే అటు ప్రయాణికులకు, వాహనాలకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు దృష్టి పెట్టి బస్టాండ్‌లో నీటి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభి షేకం, మధ్యాహ్నం విందు భోజనం, సాయంత్రం కోలాటాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి జయంతి సందర్భంగా భారీ ఎత్తున కేకును ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆర్యవైశ్యలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'ఉపాధి' కూలీ మృతి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ఉపాధి కూలీ పాలెంకోట వెంకటేష్ (56) మృతి చెందినట్లు ఉపాధి హామీ పథకం ఎపిఒ ఉమా మహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బొజ్జవారిపల్లి గ్రామపంచాయతీలో కాలువలో పూడుక తీయుపని చేసి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మార్గం మధ్యలో కళ్ళ తిరిగి పడిపోయాడని వెంటనే ఇంటికి తరలించి ప్రధమ చికిత్స అనంతరం ఆసుపత్రికి తీసుకొని వెళ్లే ప్రయత్నం అక్కడే మృతి చెందారని తెలిపారు.



మొక్కలకు నీరు పోస్తున్న రాజు

మొక్కలను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పంచాయతీలో గేటు నుంచి పకీరరెడ్డిగారిపల్లి వరకు రోడ్డు ఇరువైపులా నాలుగు రోడ్ల సిసిలైన్ మధ్యలో బార్కెట్‌లు ఉండడంతో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి ఆధ్వ ర్యంలో మొక్కలు, పూలమొక్కలను నాటారు. బస్టాండ్ ఆవరణంలో వస్త్ర దుకాణదారులు రాజు రోడ్డులో ఉన్న బార్కెట్‌లో ఉన్న మొక్క లను ప్రతిరోజూ నీళ్ల పోసి సంరక్షిస్తున్నారు. చెట్లను ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఇలా ప్రతి ఒక్కరూ రాజును ఆదర్శంగా మొక్కలను, చెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. మొక్కలను సంరక్షిస్తే పర్యావరణాన్ని కాపాడిన పరిరక్షించుకున్నవారమవుతామని అన్నారు.

రూ.1.42 కోట్ల ప్యాకేజీ సాధించిన నిఖిత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



సాఫ్‌వేర్ ఉద్యోగం పొందిన నిఖిత

స్థానిక కోడూరు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయు డు, షర్మిల దంపతుల కుమార్తె మాచి నేని నిఖిత ప్రస్తుతం అమెరికా లోని కార్నెంజ్ మెలాన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్ డిగ్రీ సాధించారు.అలాగే ఆమెకు న్యూజెర్సీలోని న్యూబిస్ కమ్యూని కేషన్స్ సంస్థలో ఏడాదికి రూ.1.42 కోట్ల రూపా యల ప్యాకేజీతో ఉద్యోగం కూడా లభించిం దని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సా హం, ఆచా ర్యులు, స్నేహి తుల సహకారంతో ఈ స్థాయికి చేరు కు న్నానని సాఫ్ట్‌వేర్ కోర్సులపై పట్టు సాధి ంచి ఉన్నత ఉద్యోగం సాధించానని నిఖిత పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పీలేరు

2024-25 విద్యా సంవత్సరానికి 3వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీలేరు పట్టణం, కామాటంవారిపల్లె వద్ద ఉన్న గిరిజన బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులు పాఠశాలకు వచ్చి నేరుగా ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-గుర్రంకొండ

గుర్రంకొండ మండలంతో పాటు పీలేరు నియోజకవర్గంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణాపై స్థానిక రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు ఉక్కు పాదం మోపాలని అక్రమ ఇసుకాసురులపై పోలీసు కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి యం.సాంబశివ పేర్కొన్నారు. శుక్రవారం గుర్రంకొండ మండలం, తరిగొండ పంచాయతీ రామానాయునిలో సిపిఐ నాయకులు మురళి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ రామానాయుని చెరవులో పట్టపగలే అక్రమార్కులు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణా గురించి పత్రికల్లో వచ్చినప్పుడు మాత్రం అధికారులు హడావిడి చేస్తున్నారే తప్పా ఇసుకాసురులపై ఎందుకు పోలీసు కేసులు నమోదు చేయాలేదో ప్రజలకు అధికారులు సమాధానం చెప్పాలని కోరారు.

కృష్ణసాయి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు-చిత్తూరు మార్గంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎలక్ట్రీషియన్ కృష్ణసాయి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బలరాం తెలిపారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.11,200 నగదు సాయాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ బేగ్, జిల్లా కార్యదర్శి రసూల్, జిల్లా కోశాధికారి ఎన్‌టిఆర్ నఫీస్, స్థానిక ఎంఆర్ పిఎస్ పీలేరు నియోజకవర్గ నాయకులు గండికోట వెంకటేష్, ఆచారి, రహంతుల్లా పాల్గొన్నారు.

మూగజీవాలకు మేత కరువు

వేధిస్తున్న గ్రాసం కొరత
ఇబ్బందులు పడుతున్న పశుపోషణ పెంపకందారులు
మేత లేక అల్లాడుతున్న మూగజీవాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మూగజీవాలకు మేత కరువైపోతుంది. మండలంలో పశుగ్రాసం కొరత ఏర్పడడంతో ఆహారం లేక మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. వీటికి తగ్గట్టు ఎండలు మండిపోతుండడంతో పశు పోషణ పెంపకదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు వ్యవసాయం తర్వాత పశు పోషణ ప్రధాన జీవనాధారం. రైతులు పంటలు పండించకపోవడం వల్ల బీడు భూములు దర్శనమిస్తున్నాయి. గడిచిన ఏళ్లలో మెండుగా వర్షాలు పడుతుండడంతో గ్రామాలలో గొర్రెలు, మేకలు, పశువులు మందులుగా ఉండేవి. పాల దిగుబడి తో పాటు పశువుల పేడతో ఎరువులు లేకుండా పొలాలు సాగులో ఉండేవి. నిత్యం పశువులతో కళకళలాడే గ్రామాలు వర్షాలు పడకపోవడం పంటలు సాగు చేయకపోవడంతో పశుగ్రాసం కరువై పశు వులను కభేలాలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెరువులు కుంటల్లో నీరు సమృద్ధిగా ఉన్న రైతులు వ్యవసాయంపై ముగ్గు చూపకపోవడం వల్ల పంట పొలాలు బీడు భూములుగా మారాయి. దూరంగా వెళ్లి పొలాలు కలియతిరిగినా పచ్చగడ్డి దొరకడం కష్టతరంగా మారిందని రైతులు చెబుతున్నారు. అడవులలో పనికి వెళ్లినవారు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో అక్కడ పచ్చగా ఉన్న గడ్డి అగ్నికి ఆహుతి అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క రెండు గడ్డి ధరలు భగ్గు మంటున్నాయి. ఇటువంటి పరిస్థితులలో రైతులు పాడి పశువులను తక్కువ ధరలకు కబేశాలకు అమ్ముకుంటున్నారు. దానిపై ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై పశుగ్రాసాన్ని అందించాలని పశు కాపరులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశుగ్రాసం

మేత దొరకడం లేదు

వర్షాలు లేక పశుగ్రాసం కొరత వెంటాడుతుంది. అడవి ప్రాంతాలకు వెళ్లి పశు వుల కోసం బోధ తెచ్చుకుంటున్నాను. కొండలకు నిప్పు పెట్టడంతో బోధ కూడా దొరకడం లేదు. పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.

- అంకాలు, గొర్రెల కాపరి

మేత ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లాల్సిందే

మాకు 60 గొర్రెలు ఉన్నాయి. వేసవికాలంలో మేత కరువైనందున ఎక్కడ నేత జరుగుతుందో అక్కడికి ఉదయాన్నే సద్ది మూట ఎత్తుకొని వెళ్లాల్సిందే. కూలీలు ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయం చేసిన ఖర్చులు కూడా రావడం లేదు. వ్యవసాయం వదిలేసి గొర్రెల కొనుగోలు చేసి కొండ ప్రాంతాలకు వెళ్లి మేపుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం అధికారులు స్పందించి సబ్సిడీ ధరలపై పశుగ్రాసం పంపిణీ చేయాలి.

- నరసింహులు, పశువుల కాపరి

డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పెద్దచెరువుకట్ట



వ్యర్థాలతో నిండిన పెద్దచెరువుకట్ట

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక కుమ్మరపల్లి వద్ద ఉన్న పెద్దచెరువుకట్టపై చెత్తాచెదారాన్ని నింపి డంపింగ్ యార్డ్‌లా మారుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. చుట్టూ పక్కగ ఉన్న గృహాల సముదాయాల నుంచి వస్తున్న వ్యర్థాలే కాకుండా సుదూరు ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఇతర వాహనాలలో కూడా వ్యర్థాలు, పాతవస్తువులను తెచ్చి వదలి వెళుతున్నారని చెబుతున్నారు. పంచా యతీ సర్పంచ్ చొరవతో వ్యక్తపదార్థాలను జెసిబి యంత్రం తొలగిం పజేస్తున్నా వ్యర్థాలు వేసే వారు మాత్రం మానుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహాలలో ఉండే వ్యర్థాలను తీసుకెళ్లేందుకు పంచాయతీ అధికారులు చెత్తవాహనాలను ఏర్పాటు చేసినా ఇక్కడ చెత్త వేస్తూనే ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పెద్దచెరువుకట్టపై చెత్త వేయకుండా శాశ్వతమైన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వినయ్‌కుమార్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-రాయచోటి

డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని పదిమందికి ఆదర్శం కావాలని ట్రాఫిక్ సిఐ షేక్ మహబూబ్‌బాషా, డాక్టర్ భయ్యారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంక్ లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 25 మంది రక్తదాతలు రక్తదానం చేయడం జరిగింది. ముఖ్య అతిథు లుగా పాల్గొన్న ట్రాఫిక్ సీఐ షేక్ మహబూబ్ బాషా, డాక్టర్ భయ్యా రెడ్డి, ప్రతిభా కళాశాల కరస్పాండెంట్ శివ గంగిరెడ్డి , షిరిడీ సాయి మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, డాక్టర్ మహేష్ రా , బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ వినయ్ కుమార్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, విస్తృత సాయి సేవా కార్యక్రమాలతో ఎదిగి సమాజ సేవకు తోడ్పడడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్క యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి మనిషి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. డాక్టర్ భయరెడ్డి మాట్లాడుతూ వినయ్ కుమార్ జన్మదిన వేడుకలు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ట్రస్ట్ సభ్యులను అభినందించారు. వినయ్ కుమార్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపు కోవాలని ఆకాంక్షించురు. వినయ్ కుమార్ మాట్లాడుతూ తన జన్మదిన సందర్భంగా శిబిరాన్ని ఏర్పాటు చేసిన తన ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న యువకులు

ఇవిఎం స్ట్రాంగ్ రూములకు పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఇవిఎం స్ట్రాంగ్ రూములకు పటిష్ట భద్రత కల్పించినట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఇవిఎంల స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల భవనాలను ఎస్‌పి బి.క్రిష్ణారావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఆరు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంటు నియోజక వర్గాలకు సంబంధించి పోలింగ్ అయిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరిచామని తెలిపారు. సాయి ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సిఐ, డిఎస్‌పి, మొబైల్ టీమ్, సిఆర్‌పిఎఫ్, ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్సెస్, రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 144 సెక్షన్ కౌంటింగ్ ముగిసే వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల మేరకు జిల్లా ప్రజలందరూ ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా జిల్లా యంత్రాంగానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.



ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

పర్యాటక శోభకు దూరం.. అల్లాడుపల్లె

ప్రజాశక్తి- చాపాడు



విశ్రాంతి భవనం

జిల్లాలోనే శైవ క్షేత్రాల్లో ఒకటైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం పర్యాటక శోభకు దూరంగా ఉంది. అల్లాడుపల్లె దేవస్థానానికి మన జిల్లాతోపాటు, చిత్తూరు, కర్నూలు, అనంతపురం, బళ్ళారి, కర్ణాటక ప్రాంతాల నుంచి తరచూ వస్తుంటారు. ఎక్కువగా కార్తీక మాసంలో, శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. అల్లాడుపల్లె దేవళాలు మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో కుందూ నది ఒడ్డున ఉంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అల్లాడుపల్లె దేవళాలుకు వచ్చేందుకు సులభంగా ఉంటుంది. సెలవు దినాల్లో, సాయంత్రం వేళల్లో కుటుంబ సమేతంగా వచ్చి అల్లాడుపల్లెను సందర్శిస్తారు. ఈ ప్రాంతం అన్ని రకాలా అనుకూలంగా ఉంటుంది. అయితే కేవలం స్వామివారిని దర్శించుకునేందుకు మాత్రమే కాకుండా పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తే మరింత ప్రాచుర్యంలోకి వస్తుంది. 2010లో హెరిటేజ్ కారిడార్ సర్క్యూట్ పేరుతో రూ.1.60కోట్ల పర్యాటక శాఖ తరపున అల్లాడుపల్లె అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం రూ.1.49కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో భక్తులకు విశ్రాంతి భవనం, మంచినీటి ట్యాంకు, సిమెంటు రోడ్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. పార్కు, కుందూ నదిలో స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేయకుండా వదిలేశారు. పార్కు, హరిత హోటల్ ఏర్పాటును పూర్తిగా వదిలేశారు. ఆ పనులు పూర్తి కాకుండానే ఆగిపోయాయి. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, స్థానిక నాయకులు అల్లాడుపల్లె అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. అల్లాడుపల్లె పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందేందుకు అన్ని రకాల అనుకూలం. కేవలం శైవక్షేత్రంగా కార్తీక మాసం, శివరాత్రి పండుగ రోజుల్లో మాత్రమే ప్రజలతో కళకళలాడుతుంది. పర్యాటక శాఖ తర పున ఇప్పటికైనా పార్కు, స్నానఘట్టాలను ఏర్పాటు చేసి, హరిత హోటల్ నిర్మిస్తే జిల్లాలో మంచి పర్యాటక ప్రాంతంగా అల్లాడుపల్లె ప్రసిద్ధి చెందనుంది.



అల్లాడుపల్లె దేవస్థానం

కార్యకర్తలు సంయమనం పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వైసిపి కార్యకర్తలు, అభిమానులు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి మద్దతు పలకడమే కాకుండా శ్రమించి తన గెలుపు కోసం కృషి చేశారని కొనియాడారు. ఎన్నికలకు ముందు, తర్వాత కూడా తెలుగుదేశం పార్టీ నాయ కులు వారి అధినాయకుడి ప్రోత్సాహంతో గ్రామాల్లో వైసిపి నాయకులను, ప్రజలను రెచ్చగొట్టే ధోరణికి సిద్ధమయ్యారన్నారు. దాడులకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉంటూ సంయమనం పాటించాలన్నారు. ఈ ఎన్నికల్లో పోలీసు వారి పాత్ర మనం మెచ్చుకోదగిందన్నారు. సాధ్యమైనంత వరకు వారి కర్తవ్యాన్ని నిష్పక్షపాతంగానే నిర్వహించారని పేర్కొన్నారు. కొన్నిచోట్ల పోలీసులు కొంత పక్షపాత వైఖరిని అవలంబించినప్పటికీ వైసిపి నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాలే తప్ప, ఎదుటి పార్టీ వారిని దూషించడం, దాడులు చేయడం మన సిద్ధాంతం కాదన్నారు. వారు ఎంత రెచ్చగొట్టినా ఏం చేసినా సాధ్యమైనంత వరకు మీరందరూ ఓర్పు వహించాలని ఎమ్మెల్యే కోరారు. చట్టం తన పని తాను చేస్తుందన్నారు. జిల్లా పోలీసుశాఖ వారు ఈ విషయంలో చాలా కఠినంగా ఉన్నారు.. కాబట్టి దాడులకు తెగబడిన వారిని చట్ట ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అందరూ సంయమనం, ఓర్పు వహించాలన్నారు



జెసిబితో మురుగునీటి కాలువను శుభ్రం చేయిస్తున్న అధికారులు

జెసిబితో మురుగునీటి కాలువ శుభ్రం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు ప్రాంతంలో వర్షానికి స్తంభించిన మురుగునీటి కాలువను జెసిబితో శుభ్రం చేయించినట్లు గ్రామపంచాయతీ ఇఒపిఆర్‌డి ఎస్.ఎ.గఫూర్ తెలిపారు. గురువారం కురిసిన వర్షం కారణంగా ఆర్‌టిసి నల్లగుట్ట ప్రాంతం నుంచి ఆర్‌టిసి ప్రాంగణ మార్గంలో వెళ్లే మురుగునీటి కాలువ మట్టి రాళ్లతో నిండుకుని స్తంభించి పోవడంతో దాన్ని శుక్రవారం ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్ల కుమార్ సమక్షంలో శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఈ పనులను గ్రామపంచాయతీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, సివిల్ ఇంజినీరింగ్ సిబ్బంది, పంచాయితీ మేస్త్రి పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది పూర్తి చేశారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న యల్లటూరు అభిమానులు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేనపార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం రాజంపేటలో ఘనంగా నిర్వహించారు. ఎల్లటూరు అభిమానులు ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు, కుల మతాలకతీతంగా ప్రజా సేవ చేయ గలిగే సేవా తత్పరుడు శ్రీనివాసరాజు అని కొనియాడారు. ఆయన పుట్టినరోజు వేడుకలు పేదల మధ్య జరుపుకోవడం సంతోషకరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటనాగేశ్వరరాజు, సిబ్బంది, జనసేన నాయకులు శివ పాల్గొన్నారు.

పల్నాడును రావణ కాష్టం చేశారు : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-కడప

పల్నాడు ప్రాంతాన్ని రావణ కాష్టం చేశారని, అదే పంథాలో కడపను చేయాలని టిడిపి ప్రయత్నిస్తుందని డిప్యూటీ సిఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. 2014, 2019లో లేని ఘర్షణలు 2024 వస్తున్నాయంటే టిడిపి కుట్రేనని ప్రజలు గ్రహించాలని అన్నారు. కడప ఎమ్మెల్యేగా మూడవసారి నా గెలుపు కోసం అవిశ్రాంతంగా కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఎన్నికల అనంతరం పల్నాడులో టిడిపి రౌడీలు చేసిన అరాచకం ప్రజలకు విధితమేనని అన్నారు. టిడిపికి ఓటు వేయలేదని ఆ పార్టీ నాయకులు రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మారుస్తున్నారని ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎపి ఎస్‌పిడిసిఎల్ మైదుకూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎఇ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైదుకూరు, ఖాజీపేట మండల పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు.ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని హిజ్రా ఆత్మహత్య

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని కేసాపురం గ్రామ పరిధిలో రాయచోటి-మదనపల్లె రహదారి పక్కన గల ఆంజనేయస్వామి గుడి వెనుక గల జమాయిల్ చెట్లు గల ఆటవి ప్రాంతంలో గుర్తు తెలియని హిజ్రా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతురాలు ఎర్ర అంచు గల పచ్చ చీర, రోజ్‌కలర్ జాకెట్ ధరించి ఉందని చెప్పారు. ఆ మహిళ ఆత్మహత్యకు పాల్పడిందా మరేమైనా కారణాలున్నాయా అనే కోణం విచారణ చేస్తామని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని తెలిపారు.

ఐదుగురిపై కిడ్నాప్ కేసు నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

సాయిజిలానీ అనే యువకుడ్ని కొట్టిన కేసులో ఐదుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దనూరుకు చెందిన సాయి జిలానీ రెండు నెలల క్రితం బొందలకుంట గ్రామంలో జరిగిన జాతరకు బైకులో వెళ్లాడు. సాయి జిలానీ తన బైకుతో కర్రయ్య శ్రీధర్ (బాబీ)ని ఢీ కొట్టడంతో ఇద్దరు గొడవ పడ్డారు. గురువారం సాయంత్రం కర్రయ్య శ్రీధర్, జగదీష్ బాలుర ఉన్నత పాఠశాల వద్దకు వెళ్లారు. అప్పటికే సాయి జిలానీ అతని స్నేహితులు అక్కడ ఉన్నారు. సాయి జిలానీ రెండు నెలల క్రితం బొందలకుంట జాతరలో జరిగిన గొడవ మనసులో పెట్టుకుని తన స్నేహితులతో కలిసి జగదీష్, శ్రీధర్‌పై దాడి చేసి కొట్టారు. అదే రోజు రాత్రి సాయి జిలానీ అతని స్నేహితులు కలిసి నాలుగు రోడ్ల సమీపంలోని ఓ దాబాలో భోజనం చేస్తున్నారు. కర్రయ్య శ్రీధర్, మంజుల జగదీష్, బడుగు రాజు అలియాస్ దుద్దు, అగడూరు రవి, మరో వ్యక్తి కలిసి సాయి జిలానీని బలవంతంగా కారులో ఎక్కించుకుని బొందలకుంట సమీపంలో ఉన్న తారు ఫ్యాక్టరీ దగ్గరికి తీసుకెళ్లి కొట్టారు. బాధితుడు సాయి జిలానీ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆ అయిదు మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

మండలంలో అదృశ్యమైన మతిస్థిమితం లేని బాలుడు ఆచూకీ లభించింది. సిఐ సూర్యనారాయణ కథనం మేరకు వివరాలు పట్టణంలోని పంజురమ్మ వీధిలో నివాసమున్న డి.మహేష్‌బాబు కుమారుడు డి.కుషి వర్ధన్ ఇంటి నుంచి బయటికి వెళ్లి కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. తాము సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూపులలో కుషి వర్ధన్ ఫోటో పంపడం జరిగిం దన్నారు. ఒక గంటలోనే పోలీసులు బాలుడు ఆచూకీ కనుగొన్నామని తెలి పారు. అనంతరం ఆ బాలు డిని తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగిం చడంతో కథ సుఖాంతం అయిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మిస్సింగ్ కేసులను సులువుగా ఛేధించడానికి వీలవుతుందని సిఐ వెల్లడించారు.